భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది

డబ్ల్యూఆర్ఐ ఇండియా సీనియర్ ఫెలో ప్రొఫెసర్ అమితాబ్ కుందు


కార్యక్రమంలో మాట్లాడుతున్న అమితాబ్ కుందు

రాయదుర్గం: భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని డబ్ల్యూఆర్ఐ ఇండియా సీనియర్ ఫెలో ప్రొఫెసర్ అమితాబ్ కుందు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం 'ఇండియా టువర్డ్స్ ఇన్‌క్లూజివ్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అవకాశాలు, చాలెంజెస్' అనే అంశంపై వ్యవస్థాపక దినోత్సవ ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ మాట్లాడుతూ.. బ్రూకింగ్స్ ప్రాజెక్షన్ ఆఫ్ షేర్ సంస్థ 2028 నాటికి భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అంచనా వేసిందని గుర్తు చేశారు. లేబర్ మార్కెట్ యాక్సెస్‌లో ఉన్న అసమానతలు కొద్దిగా తగ్గుతాయన్నారు. 2050లో భారతదేశ వాటా 27 శాతంగా ఉండవచ్చని ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా వేసిందన్నారు. అనంతరం 'మనూ' చాన్స్‌లర్ ముంతాజ్‌అలీ మాట్లాడుతూ.. త్వరలో నిర్వహించే ఉర్దూ విశ్వవిద్యాలయ కాన్వకేషన్‌కు రాష్ట్రపతిని ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దేశాభివృద్ధిలో ఆర్థిక వ్యవస్థ, విద్య కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హాసన్ మాట్లాడుతూ.. త్వరలో స్కూల్ ఆఫ్ లా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో 'మనూ' ఓఎస్‌డీ-1 ప్రొఫెసర్ షగుఫ్తా షాహీన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్లు సయ్యద్ షా మహ్మద్ మజారుద్దీన్ ఫారూఖీ, అమీనా కిషోర్, నసీముద్దీన్, ఎస్ఎం రహమతుల్లా, తహసీన్ బిల్గ్రామి, పీఎస్ మునవర్ హుస్సేన్‌ఖాన్, మల్లిక, షేక్ మహ్మద్ సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంఏ సమీ సిద్దిఖీ, మహ్మద్ ముస్తఫా అలీ సర్వారీ, మేరాజ్ అహ్మద్, ఐఎంసీ డైరెక్టర్ డాక్టర్ రిజ్వాన్ అహ్మద్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే సంత

- వాహనదారులు, పాదచారుల ఇబ్బందులు
- శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో ఇదే పరిస్థితి
- ప్రత్యేక స్థలాల కేటాయించాలని డిమాండ్


కొండాపూర్‌లోని మైహోమ్ మంగళ రోడ్డుపై సంత

గచ్చిబౌలి: పెద్ద పెద్ద షాపుల్లో ధరలు భరించలేక చాలా మంది సంతలకు వెళ్తుంటారు. ఇక్కడ చౌక ధరలతో పాటు తాజా సరుకులు దొరుకుతాయని వారి నమ్మకం. అందుకే వారంతపు సంతలకు ఫుల్ డిమాండ్. ఈ క్రమంలో నిత్యం ఏదో ఒకచోట ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అయితే, సంతల కొనసాగింపు తప్పనిసరి కావడంతో వీటికి ప్రత్యేక స్థలాలు కేటాయించాలనే డిమాండ్ ఉంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రహదారులపై నిత్యం సంతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంతలు జరిగే ప్రాంతాలు

ఆదివారం నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, తారానగర్, గుల్‌మోహర్ పార్కు కాలనీ, మదీనాగూడ, గోకుల్ ఫ్లాట్స్ పెద్ద చర్చి వద్ద సంతలు ఉంటాయి. మంగళవారం ఖాజాగూడ, గోపినగర్, బుధవారం రాయదుర్గం, గంగారం, ఆర్టీసీ కాలనీ, జనప్రియ ఫేజ్ 5, మాదాపూర్ 80 ఫీట్ల రోడ్డుపై, గురువారం ఉర్దూ యూనివర్సిటీ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, తాజ్‌నగర్, గోపన్‌పల్లి, హుడాకాలనీ, ఆల్విన్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, జనప్రియ అపార్ట్‌మెంట్స్, దూబే కాలనీ, టీఎన్‌జీఓకాలనీ, శుక్రవారం మధురానగర్, గోపన్‌పల్లి తండా, శనివారం, జీపీఆర్ఏ క్వార్టర్స్, మైత్రినగర్ మంజరారోడ్డులో సంతలు కొనసాగుతున్నాయి.

నిర్వహణ కోసం..

నల్లగండ్ల రోడ్డులోని మార్కెట్ ప్రత్యేక స్థలంలో షెడ్లు నిర్మించి కూరగాయలు, ఇతర వస్తువులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు. మరో వైపు మోడల్ మార్కెట్లు ప్రస్తుతం జంట సర్కిళ్లలో నాలుగు చోట్ల నిర్మించి వదిలేశారు. వాటికి కూడా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్: చందానగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు. ఆర్టీసీ కాలనీ(మైత్రీనగర్) ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ల్యాండ్ మార్కు రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసీరాం చాంబర్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు. మదీనాగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కల్కి హైట్స్, రామకృష్ణనగర్, కల్లెం అంజిరెడ్డి స్కూల్, పైప్‌లైన్ రోడ్డు, యశోద పెరల్, మదీనాగూడ మసీదు ఏరియా, నైమిషా అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

హఫీజ్‌పేట్ : తారానగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుమన్ తెలిపారు. శాంతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు శాంతినగర్, కడిమి హాస్పిటల్, హుడా కేఫ్ దగ్గర, వెంకటాద్రి నగర్, జీహెచ్ఎంసీ మీసేవ లైన్, విద్య నర్సింగ్ హోమ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు. చందానగర్ హుడా కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు చందానగర్ హుడా కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

గచ్చిబౌలి: మాస్టర్ ప్లాన్ వింగ్ ఏబీ కేబుల్ వర్క్ చేస్తుండటంతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణు గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్నాహ్నం 1 వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్ నెంబర్ 1, 2, 3, రాడిసన్ హోటల్, క్వయట్ లాండ్ విల్లాస్, గచ్చిబౌలి ఫ్లై ఓవర్ ప్రాంతం, హిమగిరి హస్పిటల్ పరిధిలో కరెంటు ఉండదు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డాగ్ పార్క్ ఏరియా, రాడిసన్ హోటల్, లీ మెరీడియన్ హోటల్ తదితర ప్రాంతాలో విద్యుత్ సరఫరా ఉండదు.

విభిన్న భాషల ఐక్యతే మన విశిష్టత

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ ఆచార్య సి మృణాళిని

రాయదుర్గం: విభిన్న భాషలు ఉన్నప్పటికీ వాటి మధ్య ఐక్యత కొనసాగడమే భారతదేశ విశిష్ట లక్షణమని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగ కన్వీనర్, సిలికానాంధ్ర(యూఎస్ఏ) తెలుగు శాఖ అధ్యక్షురాలు ఆచార్య సి.మృణాళిని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో మానవీయశాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ ఆడిటోరియంలో మంగళవారం భారతీయ భాషోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మృణాళిని మాట్లాడుతూ.. మూలంలో భావం కోల్పోకుండా మహాభారతాన్ని తెలుగులోకి అనుసృజన చేసిన గొప్పతనం కవిత్రయ భారతానికి చెందుతుందన్నారు. వ్యాస మహాభారతంలోని పరమార్థాన్ని యథాతథంగా తెలుగులోకి తీసుకొచ్చారన్నారు. తెలుగు ప్రజలకు భక్తి కంటే లౌకి విషయాలపై ఆసక్తి ఎక్కువని చెప్పారు. ఆ దిశగానే సాహిత్యం కూడా వెలువడిందన్నారు. సుబ్రహ్మణ్య భారతి తన రచనల్లో కందుకూరి వీరేశలింగం పంతులుని గొప్ప పాత్రగా మలిచిన తీరుని కొనియాడారు. ఆమె తమిళ కవి అయినప్పటికీ తెలుగుని సుందరమైన భాషగా ప్రశంసించారని గుర్తుచేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ కూడా 24 భాషల్లో జాతీయ స్థాయి పురస్కారాలను అందిస్తోందన్నారు.

అనంతరం డీన్ ప్రొఫెసర్ వి.కృష్ణ మాట్లాడుతూ.. భారతీయ భాషా దినోత్సవం దేశ సమైక్యతకు నిదర్శంగా భావించాలన్నారు. ఇఫ్లూ యూనివర్సిటీ అనువాద శాఖ అధ్యక్షుడు ఆచార్య వీబీ తారకేశ్వర్ మాట్లాడుతూ.. విభిన్న భాషలకు కేంద్రంగా భారతదేశం కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా హిందీ శాఖ అధ్యక్షుడు ఆచార్య సి.అన్నపూర్ణ సుబ్రహ్మణ్య భారతి కవితలను, ఆచార్య పిల్లలమర్రి రాములు తెలుగు కవితను ఆలపించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు వ్యవహరించిన ఈ సమావేశంలో ఆచార్యులు బి.భీమయ్య, ఏఎం ఫజలుల్లా, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణన కోసం నేడు సత్యాగ్రహం

రాయదుర్గం: ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో హెచ్‌సీయూ ప్రధాన గేటు ఎదుట నేడు(బుధవారం) ఓబీసీ సత్యాగ్రహం జరగనుంది. కులగణన, సామాజిక న్యాయం కోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ కార్యక్రమం చేస్తున్నట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ వెంకటేశ్, ఆళ్ల రామకృష్ణ, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

బాడీబిల్డర్‌కు సన్మానం



శేరిలింగంపల్లి: ఇటీవల జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో లింగంపల్లికి చెందిన వినయ్ ప్రతిభ కనబరిచాడు. ఎంఐఆర్ అలీ క్లాసిక్ అండ్ ఫిజిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచాడు. దీంతో మంగళవారం వినయ్‌ని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా నాగేందర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో వినయ్ జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, లక్ష్మణయాదవ్, గోపాల్‌యాదవ్ తదితరులున్నారు.

శేరిలింగంపల్లి ప్రజలకు రుణపడి ఉంటా


అభినందన సభలో ఎమ్మెల్యేని సన్మానిస్తున్న సభ్యులు

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. మంగళవారం చందానగర్ హుడా కాలనీలో ఎమ్మెల్యేకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అండగా ఉన్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, నాయకులు మల్లారెడ్డి, మనోహర్ గౌడ్, వాలా హరీష్‌రావు, లక్ష్మారెడ్డి, దాత్రినాథ్‌గౌడ్, విమల్ కుమార్, రవీందర్‌రెడ్డి, మల్లేష్, జనార్దన్ గౌడ్, తిరుమలేశ్, కంది జ్ఞానేశ్వర్, ప్రశాంత్, రాజేశ్వర్ గౌడ్, రాజు, వెంకట్‌రెడ్డి, పవన్, భగత్, గోపి, శ్రవణ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి


జనప్రియనగర్ ఫేజ్ 2లో స్థానికులతో మాట్లాడుతున్న జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్ : స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్ ఫేజ్ 2లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. పక్కా ప్రణాళికతో గ్రేటర్ హైదరాబాద్‌ని అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నాగేశ్వరరావు, యాదగిరి గౌడ్, నరేందర్ గౌడ్, సంగారెడ్డి, సాంబశివరావు, సత్యనారాయణ, ఉమా మహేశ్వరావు, అశోక్, కొండల్‌రావు, అంజయ్య ఉన్నారు.

మూడు రోజుల్లో ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తి


దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలిస్తున్న డీసీ

హఫీజ్‌పేట్: అభయ హస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీలను మరో మూడు రోజులలో పూర్తి చేస్తామని చందానగర్ సర్కిల్ 21 ఉప కమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం చందానగర్‌లోని లైట్ హోమ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కొనసాగుతున్న ఆన్‌లైన్ ఎంట్రీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వచ్చిన అభయహస్తం దరఖాస్తులను తుది గడువుకు ముందే డేటా ఎంట్రీ పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం 130 మంది సిబ్బంది, 13 మంది సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారని తెలిపారు.

ఊరెళ్లినా అప్రమత్తత అవసరం

సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ నర్సింహా కొత్తపల్లి


నర్సింహా కొత్తపల్లి, సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్

రాయదుర్గం: సంక్రాంతికి ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని మంగళవారం సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ నర్సింహా కొత్తపల్లి సూచించారు. పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు ఊరు వెళ్లే వారికి సైబరాబాద్ పోలీసులు కొన్ని సూచనలు చేశారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని, ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్తే విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలని తెలిపారు. ఇంటి తలుపులకు సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవడం సురక్షితమని చెప్పారు. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయం చేసుకుంటే చోరీలు నియంత్రించడం సులభమని తెలిపారు. ఊరు వెళ్లే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, స్టేషన్ నంబర్ కూడా దగ్గరుంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రయాణాల వివరాలు సోషల్ మీడియాలో పంచుకోవద్దన్నారు. కొత్త వ్యక్తుల కదలికలపై 100కు లేదా సైబరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 9490617444కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అంబీర్ చెరువును అభివృద్ధి చేయండి

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఉప్పల ఏకాంత్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అతి పెద్ద అంబీర్ చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్నాటి అశోక్, జితేందర్, పుష్పేందర్, అల్వాల రమేష్, నాగరాజు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక ఆకట్టుకున్నాయి. గాంధీ శిల్ప బజార్ నేషనల్ మేళా, సంక్రాంతి సంబరాలు సందర్భంగా చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు సందర్శకులు ఫిదా అయ్యారు. వర్షిణి శిష్య బృందంచే ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. పుష్పాంజలి, గణేశ స్తుతి, అలరిపు, జతిస్వరం, అయిగిరినందిని తదితర అంశాలను వర్షిణి, కీర్తి, లాస్య, ప్రణవి, అనన్య తదితరులు ప్రదర్శించారు. శ్రీ వల్లీరావు శిష్య బృందంచే ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో పుష్పాంజలి, జాలరులు కురియగ, శివాష్టకం, మరకతమణిమయ తదితర అంశాలను శ్రీకృతి, రిధిమా, యశస్వీని, ధ్రువి, మోక్ష, మేఘన, శివ తదితరులు ప్రదర్శించారు.

'బీ న్యూ'లో హీరోయిన్ రుహానీశర్మ సందడి


ఫోన్ విడుదల చేస్తున్న రుహానీ శర్మ, తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లో బీ న్యూ షోరూంలో రెడ్‌మీ నోట్ 13(5జీ) సిరీస్‌ను నటి రుహానీ శర్మ, సంస్థ సీఈఓ సాయి నిఖిలేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్‌లతో కలసి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌మీ సేల్స్ సీనియర్ మేనేజర్ సయ్యద్ అన్వర్, రిటైల్ మార్కెటింగ్ మేనేజర్ మహమ్మద్ ఇష్తాకర్, శ్రీవాస్తవ్ తదితరులున్నారు.

సెలెక్ట్ మొబైల్స్‌లో రెడ్‌మీ ఫోన్ విడుదల


కార్యక్రమంలో పాల్గొన్న సినీనటి సిరి హన్మంతు, మురళి రేతినేని తదితరులు

మాదాపూర్: రెడ్‌మీ నోట్ 13(5జీ)ని సినీ నటి సిరి హన్మంతు, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేని కలసి మాదాపూర్‌లోని సెలెక్ట్ మొబైల్ స్టోర్‌లో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టడంలో సెలెక్ట్ మొబైల్స్ ముందుంటుందని తెలిపారు. ఈ మోడల్ ఫోన్‌లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సంస్థ సీఎండీ గురు మాట్లాడుతూ.. సంక్రాంతి ఆఫర్‌లో భాగంగా అన్ని మోడల్స్‌పై రూ.3 వేల వరకు తగ్గింపు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హెడ్ సయ్యద్ అన్వర్, రిటైల్ మార్కెటింగ్ హెడ్ ఇష్తికర్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో దొంగలు పడ్డారు

దుండిగల్: బస్తీ దవాఖానాలో దొంగలు పడ్డారు. అందులోని సర్జికల్ పరికరాలు, బీపీ మెషిన్లు, ఇతర సామగ్రిని దొంగలించారు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి పరిధి సర్వే నం.120లో ఆరు నెలల క్రితం బస్తీ దవాఖానా ఏర్పాటు చేశారు. అందులో సామగ్రిని సమకూర్చారు. కానీ ఎన్నికల నేపథ్యంలో దవాఖానాను ప్రారంభించడంలో తీవ్ర ఆలస్యమైంది. దీంతో అప్పటి నుంచి దవాఖానాకు తాళం వేసి ఉంది. ఇదే అదనుగా భావించిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా ప్లాస్టిక్ కుర్చీలను ధ్వంసం చేయడం గమనార్హం. డిసెంబరు 23వ తేదీన దొంగతనం జరిగినట్లు వైద్య సిబ్బంది ఆలస్యంగా గుర్తించారు. మంగళవారం డాక్టర్ శివాని ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూపీహెచ్‌సీ సెంటర్‌లో సమస్యలు పరిష్కరిస్తా


మెడికల్ ఆఫీసర్ శాలినితో కలసి సమావేశమైన కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ యూపీహెచ్‌సీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా శాలిని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం కార్పొరేటర్ సబిహా బేగం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సెంటర్‌లో నెలకొన్న పలు సమస్యల గురించి మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. రాత్రిపూట నీటి సరఫరా, వాచ్‌మెన్, స్టాఫ్ నర్సులు కావాలని, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలన్నీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కో-ఆర్డినేటర్ వీరారెడ్డి, పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాహిద్ షరీఫ్ బాబా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రాలు



మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిన్నారులు వేసిన చిత్రాలు

మాదాపూర్: చిన్నారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం సిల్వర్ ఓక్స్ పాఠశాల విద్యార్థులు వేసిన చిత్రాలను 'సమీకృత' పేరిట ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఓన్ స్టూడియో డైరెక్టర్ వైదికరావు కాట్రగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 190 మంది విద్యార్థులు వేసిన 190 చిత్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆధునిక వసతులతో పూర్తిస్థాయి ఫర్నిచర్‌తో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సౌజన్యంతో రూ.4.50 కోట్లతో ఘనపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను ఇటీవల పూర్తిచేశారు. ఈమేరకు మంగళవారం ప్రభుత్వ పాఠశాల భవనాన్ని గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సీఎస్ఆర్ హెడ్ రఘురామన్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించిన గ్లాండ్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కావ్యకాశిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బాసిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సురేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దశరథరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష..

రాబోయే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు, జెండా ఆవిష్కరణ, తదితర అంశాలపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వివిధ శాఖల అధికారులతో కలిసి క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్, మండల విద్యాధికారి రాథోడ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులుపాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్

పటాన్‌చెరు టౌన్: పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన సరిత, గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మికి వైద్య చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 2,50 లక్షల విలువైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు

భాగ్యనగర్‌కాలనీ: కేపీహెచ్‌బీకాలనీ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన సీహెచ్. వెంకన్నను గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కర్క నాగరాజు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో కుతాడి కృష్ణ, సప్పిడి భాస్కర్, కర్ర చిన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో వనభోజనాలు



మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో మంగళవారం ఆర్టీసీ వనభోజన కార్యక్రమం రెండోరోజు కూడా నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులకు భోజనాలతో పాటు ఆటలు, పాటలతో సరదాగా గడిపారు. కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ కండక్టర్స్, డ్రైవర్సు, మెకానిక్స్‌తో అంత్యాక్షరి, పాటల పోటీలు, వివిధ రకాల ఆటలతో సరదాగా గడిపారు. అంతకు ముందు ఐదుగురు ఉత్తమ డ్రైవర్స్, ఐదుగురు కండక్టర్స్, ఐదుగురు మెకానిక్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రామయ్య అక్షింతల పంపిణీ

మూసాపేట: మూసాపేటలోని పలు బస్తీలలో అయోధ్య నుంచి వచ్చిన పవిత్రమైన అక్షింతలను మూసాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పిట్ల మనోహర్ పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా ఇంట్లో పూజలు నిర్వహించి దీపాలు వెలిగించాలని కోరారు. అదేరోజు అయోధ్య నుంచి వచ్చిన ఈ అక్షింతలను తలపై వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, మహిళా నాయకురాలు జానకీ, ఎస్.రాజేశ్వరి, అనూష, దీప్తి, చంద్రకళ, సాయి, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.